ప్రజాశక్తి
గురువారం 29 మే 2025

పార్వతీపురం మన్యం

విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులుగా దయానంద

ప్రజాశక్తి - కురుపాం

జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులుగా కురుపాంలోని ప్రదీప్ నగర్ కాలనీకి చెందిన బచ్చల దయానంద ఎంపికయ్యారు. ఆయన స్వార్డ్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్‌గా ఉంటూ ప్రజలకు వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో కమిటీ సభ్యులుగా నియమించినందుకు ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

తోటపల్లి నీటి కోసం రోడ్డెక్కిన రైతులు

ర్యాలీ నిర్వహిస్తున్న రైతులు, రైతుసంఘం నాయకులు, రైతు ప్రతినిధులు

- పట్టణంలో ఎపి రైతుసంఘం ఆధ్వర్యాన భారీ ర్యాలీ
- సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద బైఠాయింపు
- సిఐ హామీతో ఆందోళన విరమించిన రైతులు

ప్రజాశక్తి-పాలకొండ

తోటపల్లి నీరు తమ భూములకు అందించాలని కోరుతూ రైతులు బుధవారం రోడ్డెక్కారు. పట్టణంలో కోటదుర్గమ్మ ఆలయం నుంచి ఆర్‌డిఒ కార్యాలయం వరకు ఎపి రైతుసంఘం ఆధ్వర్యాన వర్షాన్ని కూడా లెక్క చేయకుండా భారీ ర్యాలీ చేపట్టారు. సబ్‌కలెక్టర్ కార్యాలయం గేటు దగ్గర బైఠాయించి, ధర్నా చేపట్టారు. తోటపల్లి ఎడమ కాలువ ఆధునికీకరణ పనులు పూర్తి చేయాలని, నిధులు కేటాయించాలని నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి, ఉపాధ్యక్షులు బంటు దాసు మాట్లాడుతూ తోటపల్లి ప్రాజెక్టు పరిధిలో పాలకొండ, వీరఘట్టం, జియ్యమ్మవలస మండలాల్లో దాదాపు 30 గ్రామాల్లో వేలాది ఎకరాల ఆయకట్టు ఉందని, 12 ఏళ్లుగా ఈ భూములకు సాగునీరు అందడం లేదని చెప్పారు. ప్రభుత్వం రూ.193 కోట్లు కేటాయిస్తే, కేవలం 23 కోట్లతో పనులు చేపట్టారని విమర్శించారు. 37 కిలోమీటర్లు పొడవున్న కాలువలో 16 కిలోమీటర్ల వరకే సిమెంట్ లైనింగ్ చేశారన్నారు. పెద్దబుడ్డిడి వద్ద సైఫాన్ పాడై ఏళ్లు గడుస్తున్నా చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. కాలువ నిర్వహణకు 15 మంది లష్కర్లు ఉండాల్సినా ఇద్దరే ఉన్నారన్నారు. కాలువల్లో జంగిల్ క్లియరెన్స్ కూడా చేపట్టలేదని ధ్వజమెత్తారు. మధుములు కూడా పూర్తిగా పాడైపోయాయని చెప్పారు. దీంతో నీటి సరఫరాకు ఆటంకం ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. 2025-26 బడ్జెట్లో రూ.590 కోట్లు కేటాయించాలని కోరితే, రూ.47 కోట్లు మాత్రమే ఇచ్చారని, ఈ నిధులు ఉద్యోగుల జీతాలకే సరిపోతాయని చెప్పారు. మరి పనులు ఎలా చేస్తారని ప్రశ్నించారు. తోటపల్లి ఎడమ కాలువ ఆధునికీకరణ పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు ఖరీఫ్‌కు సాగునీరు అందించాలని, సబ్‌కలెక్టర్ సమక్షంలో సమావేశం నిర్వహించాలని పట్టుబట్టారు.

ఎఒను నిలదీత

సబ్ కలెక్టర్ కార్యాలయ ఎఒ అప్పారావు ధర్నా వద్దకు చేరుకొని నాయకులతో మాట్లాడారు. మే ఆరో తేదీన తామిచ్చిన వినతి పత్రంపై ఏం చర్యలు తీసుకున్నారని నాయకులు ఆయన్ను ప్రశ్నించారు. దీంతో కొంతసేపు వారి మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. స్పష్టమైన హామీ ఇచ్చేంత వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని నాయకులు భీష్మించుకు కూర్చున్నారు. వెంటనే జాయింట్ సమావేశం ఏర్పాటు చేసి, దీనిపై స్పష్టమైన సమాధానం ఇవ్వాలని డిమాండ్‌చేశారు. దీంతో ఎస్ఐ ప్రయోగమూర్తి.. సిఐ ఎం.చంద్రమౌళికి సమాచారమిచ్చారు. సిఐ అక్కడికి చేరుకుని రైతు నాయకులతో మాట్లాడారు. ఉన్నతాధికారులతో మాట్లాడి, త్వరలో జాయింట్ సమావేశం ఏర్పాటు చేసేలా చూస్తామని హామీనిచ్చారు. దీంతో రైతులు ఆందోళనను విరమించారు.

రైతుల ఆందోళనకు కోటదుర్గ రైస్‌మిల్ వర్కర్స్ యూనియన్, కోట దుర్గ మార్కెట్ కళాసీ యూనియన్, గిరిజన సంఘం, ఆటో యూనియన్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మద్దతిచ్చారు. కార్యక్రమంలో పొట్లు మాజీ సర్పంచ్ బెజ్జిపురం లక్ష్మునాయుడు, అభ్యుదయ రైతు ఖండాపు ప్రసాద్ రావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు, సీనియర్ నాయకులు తిరుపతిరావు, మాజీ ఎంపిటిసి సభ్యులు కారేపు చిట్టిబాబు, గోనుమంతుల సోమశేఖర్, ఎద్దుబోయిన సింహాద్రి, గంగుల శ్రీనివాసరావు, మునుకోటి శంకర్రావు, పడాల రామచంద్రరావు, గుంటపల్లి కృష్ణ, వావిలపల్లి హరిబాబు, లోలుగు నారాయణరావు, బొత్స సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షాల పట్ల అప్రమత్తం

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ప్రజాశక్తి-పార్వతీపురం

అల్పపీడనం వల్ల భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని, పూర్తి అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. ఈ మేరకు బుధవారం జిల్లా, మండల అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ (08963- 293046) ఏర్పాటు చేశారు. భారీ వర్షాలతో పాటు దాదాపు 60 కిలోమీటర్ల వేగంగా గాలులు వీచే అవకాశాలు ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. ఎక్కడా, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగరాదని స్పష్టం చేశారు. పార్వతీపురం, పాలకొండ రెవెన్యూ డివిజనల్ కార్యాలయాలు, మండలాల్లో కంట్రోల్ రూములు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తహశీల్దార్లు, విఆర్‌ఒలు, సిబ్బంది ప్రధాన కేంద్రాలలో ఉండాలని స్పష్టం చేశారు. లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని, రాకపోకలకు ఇబ్బందులు రాకుండా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. నదులు, వాగులు, వంకలు, చెరువులను ఎవరూ దాటకుండా, దిగకుండా సూచనలు చేయాలని ఆయన తెలిపారు. శిథిలావస్థలో ఉన్న భవనాలలో ఎవరూ ఉండరాదని, తక్షణం పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. కొండ శిఖర గ్రామాల పరిస్థితిని గమనించి వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని చెప్పారు. ఒడిశాలో భారీ వర్షాల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆకస్మికంగా వరదలు వచ్చే సమయంలో వాహనదారులు, పాదచారులు ప్రమాదాలకు గురవుతారని, ఇటువంటి ప్రదేశాల్లో పోలీసు, వాలంటీర్లు లేదా ఇతరులను ఏర్పాటు చేసి ప్రమాదాల నివారించాలని కోరారు. పంచాయతీరాజ్, ఇరిగేషన్ సిబ్బంది చెరువులు, ఆనకట్టలు తనిఖీ చేయాలని, సిబ్బంది 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. గేట్లు, లాకులు తనిఖీ చేసి సక్రమంగా పనిచేసేటట్లు చూడాలని, అవుట్ ఫ్లో సక్రమంగా ఉండే విధంగా చూడాలని చెప్పారు. ప్రసవ సమయం దగ్గరలో ఉన్న గర్భిణులను గర్భిణుల వసతి గృహానికి, ఆస్పత్రులకు ముందస్తు చర్యలలో భాగంగా తరలించాలని ఆదేశించారు

మన్యంలో మోస్తరు వర్షాలు

కురుపాం : అల్పపీడన ప్రభావంతో కురుపాం మండల కేంద్రంతో పాటు పరిసర గిరిజన గ్రామాల్లో బుధవారం మధ్యాహ్నం నుంచి మోస్తారుగా వర్షాలు పడుతున్నాయి. వాతావరణ కేంద్రం తీవ్ర వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయని ప్రకటన జారీచేసిన నేపథ్యంలో అధికారులు ముందస్తు చర్యలు తీసుకున్నారు. ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి, తహశీల్దార్ ఎం.రవణమ్మ గ్రామస్థాయిలో విఆర్‌ఒలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందిని అప్రమత్తం చేశారు.

పాలకొండ : బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా బుధవారం పాలకొండలో వర్షం కురిసింది. ఒక్కసారిగా వాతావరణం చల్లబడడంతో ప్రజలు ఆనందం వ్యక్తంచేశారు. రోడ్లన్నీ తడిసి ముద్దయ్యాయి ఈ వర్షం తమకు ఉపయోగకరంగా ఉంటుందని రైతులు అంటున్నారు.

పెదబుడ్డిడిలో నువ్వు పంటపై టార్పాలిన్ కప్పుతున్న రైతు

ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

అల్పపీడన ప్రభావంతో గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస మండలాల్లో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏజెన్సీలో రైతులు వేసవి వరి పంటలతోపాటు అక్కడక్కడ పత్తి, మినుములు సాగుచేస్తున్నారు. మైదాన ప్రాంతంలో ఇటిక, అంకవరం, బిజెపురం, చినబుడ్డిడి, పెదబుడ్డిడి, పరజపాడు తదితర గ్రామాల్లో వేసవి వరి, మొక్కజొన్న, మినుములు, పెసలు, నువ్వులు పంటలు వేశారు. పంట చేతికి వచ్చే సమయంలో అల్పపీడనం ఏర్పడ్డంతో పంటలను కాపాడుకునే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. పంటచేను కుప్పలుగా వేసి టార్పాలిన్లు కప్పి ఉంచారు.

జీడిపిక్కల వ్యాపారి పరారీ

ఇంటికి తాళం వేసిన రైతులు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

తాళం వేస్తున్న గిరిజన రైతులు, నాయకులు

రైతుల వద్ద నుంచి అటవీ ఉత్పత్తులు కొనుగోలు చేసి డబ్బులు చెల్లించకుండా ఓ వ్యాపారి పరారీ అయిన సంఘటన ఏజెన్సీలో చోటు చేసుకుంది. మండలంలోని ఎల్విన్‌పేట గ్రామానికి చెందిన వ్యాపారి గోపాలశెట్టి రవి.. జీడిపిక్కలు, ధాన్యం, మిగతా అటవీ ఉత్పత్తులు రైతుల వద్ద కొనుగోలు చేసి, కోట్లాది రూపాయలు వ్యాపారం చేసేవాడు. ఈ ఏడాది కూడా గిరిజనుల నుంచి అటవీ ఉత్పత్తులు కొనుగోలు చేసి డబ్బులు చెల్లించకుండా జాప్యం చేశారు. తమ డబ్బులు కోసం నాలుగు రోజులుగా రైతులు వ్యాపారి ఇంటికి వచ్చి చూడగా తాళం వేసి ఉంది. ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ చేయడంతో చివరికి చేసేదేమీ లేక షాపు, ఇంటికి తాళం వేశారు. సుమారు రూ.2 కోట్ల నుంచి 3 రూ.కోట్ల వరకు ఎగ్గొట్టినట్లు తెలిసింది. దీంతో జీడి రైతులు, గిరిజన నాయకులు షాపునకు, ఇంటికి తాళాలు వేశారు.

సాగు భూములకు పట్టాలివ్వాలి

వ్యకాస, ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన గిరిజనుల ధర్నా

ప్రజాశక్తి-పాచిపెంట

కుడుమూరు రెవెన్యూ సర్వే నెంబర్ 48లో 782 ఎకరాల ప్రభుత్వ భూమిని సాగుచేస్తున్న గిరిజనులకు పట్టాలు పంపిణీ చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. తొలుత నిరసన ర్యాలీ నిర్వహించారు. ధర్నానుద్దేశించి సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు మాట్లాడుతూ తాతల కాలం నుంచి సాగు చేస్తున్న భూములకు నేటికీ పట్టాలు మంజూరు చేయకపోవడం దారుణమన్నారు. ఆ భూములను కబ్జా చేయాలని కొంతమంది పెద్దలు ప్రయత్నాలు చేస్తున్నారని, వారికి కొందరు అధికారులు సహకరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కాలయాపన చేస్తూ పట్టాలు ఇవ్వడం లేదని మండిపడ్డారు. సర్వే నంబర్ 48లో ఉన్న 782 ఎకరాలు ప్రభుత్వ భూమని రెవెన్యూ అధికారులు తేల్చినప్పటికీ గత ప్రభుత్వ హయాంలో సర్వే చేసిన వివరాలు ఎందుకు బహిర్గతం చేయలేదని ప్రశ్నించారు. టిడిపి అధికారంలోకి వస్తే కుడుమూరు భూములకు పట్టాలు మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని మంత్రి సంధ్యారాణి.. గ్రామాల్లో తిరిగి ప్రచారం చేశారని గుర్తుచేశారు. ఇచ్చిన హామీ మేరకు గిరిజనులకు పట్టాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సాగు పట్టాలు పంపిణీ చేయకపోతే భవిష్యత్తు పరిణామాలకు అధికారులే బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎన్.వై.నాయుడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడారు. కార్యక్రమంలో కుడుమూరు భూపోరాట కమిటీ నాయకులు కొర్ర కళ్యాణ్, శ్రీనివాసరావు, జన్ని రామయ్య, మంచాల శ్రీనివాసరావు, సుర్రు గంగయ్య, సుర్రు రామారావు, ఎర్రయ్య, కారంగి అప్పారావు, వేటూరి చిన్నారావు, రామయ్య, గెమ్మెల గోపాల్, సొయ్యారి సోమయ్య, అప్పయ్య, తదితరులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న సిపిఎం, వ్యకాస, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు, గిరిజనులు

డిఐఇఒగా నాగేశ్వరరావు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్, కొమరాడ

జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారిగా (డిఐఇఒ)గా వై.నాగేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. దీంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం కొమరాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా నాగేశ్వరరావు విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు మక్కువ ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న డి.మంజులవీణ పూర్తి అదనపు బాధ్యతలతో డిఐఇఒగా కొనసాగారు. ఆమె నుంచి డిఐఇఒ బాధ్యతలను నాగేశ్వరరావు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని సమగ్ర విద్యా కార్యక్రమాల అమలుకు కృషి చేస్తానని తెలిపారు. జిల్లాలో ఇంటర్మీడియట్ విద్యా ప్రమాణాలను మరింత మెరుగు పరిచేందుకు నిబద్ధతతో పనిచేస్తానని చెప్పారు.

డిఐఇఒ నాగేశ్వరరావును శుభాకాంక్షలు తెలుపుతున్న అధికారులు, సిబ్బంది

అల్లూరి ఏకపాత్రాభినయాన్ని ప్రదర్శిస్తున్న ప్రకాశ్‌బాబు

ఘనంగా ఎన్‌టిఆర్ జయంతి వేడుకలు

ప్రజాశక్తి-పార్వతీపురం

మాజీ ముఖ్య మంత్రి నందమూరి తారక రామారావు 102వ జయంతి వేడుకలు కలెక్టరేట్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారిక కార్యక్రమంగా ఎన్‌టిఆర్ జయంతి వేడుకలను ప్రకటించిన విషయం తెలిసిందే. ఎన్‌టిఆర్ చిత్రపటానికి కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీక ఎన్‌టిఆర్ అన్నారు. తెలుగు జాతికీ, తెలుగు భాషకూ దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చిన వ్యక్తి ఎన్‌టిఆర్ అని కొనియాడారు. స్త్రీలకు కూడా ఆస్తిలో వాటా ఉండాలని చట్టం తెచ్చిన ఘనత ఆయనదేనని, రాష్ట్రంలో మండల వ్యవస్థ ఏర్పాటు చేసిన వ్యక్తి అని తెలిపారు. ఈ సందర్భంగా సమాచార పౌర సంబంధాల శాఖ ఎన్‌టిఆర్ జీవిత చరిత్రపై ఛాయా చిత్ర ప్రదర్శన ఏర్పాటు చేసింది. కావ్యశ్రీ నృత్యశాల విద్యార్థులు శ్రావణి నేతృత్వంలో సాంస్కృతిక నృత్య కార్యక్రమాలు నిర్వహించారు. విశ్రాంత ఉపాధ్యాయులు బోనెల ప్రకాశ్ బాబు అల్లూరి సీతారామరాజు ఏకపాత్రాభినయం చేసి అలరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్ ఎస్ శోభిక, జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత, కెఆర్‌ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.ధర్మచంద్రా రెడ్డి, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి లోచర్ల రమేష్, జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్ పాల్, డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.సుధారాణి, జిల్లా ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకర రావు, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి టి.కొండలరావు, జిల్లా ఉద్యాన అధికారి బి.శ్యామల, పురపాలక సంఘం మాజీ వైస్ చైర్మన్ జయబాబు పాల్గొన్నారు.

బేషరతుగా వితంతు పింఛన్లు ఇవ్వాలి

ప్రజాశక్తి-కొమరాడ

భర్త చనిపోయిన ప్రతి మహిళకూ బేషరతుగా పింఛన్లు మంజూరు చేయాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కొమరాడలో విలేకరులతో ఆయనతోపాటు ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు కామయ్య, ఐద్వా నాయకులు కె.సంగమ్మ మాట్లాడారు. వితంతు పెన్షన్లు మంజూరు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం నిబంధనలు పెట్టడం చాలా అన్యాయమన్నారు. 2023 డిసెంబర్‌కు ముందు పింఛను వచ్చిన భర్త చనిపోతే వారికి మాత్రమే పింఛను అందిస్తామని, మిగతా వారికి మంజూరు చేయబోమనే నిబంధనలు విరమించుకోవాలని కోరారు.

ఆశ్రమాల్లో అదనపు భవనాల సమస్య

- ఐదేళ్లుగా పూర్తికాని నాడు-నేడు పనులు
- వెంటాడుతున్న నిధుల లేమి
- పాఠశాలల పునఃప్రారంభానికి రెండు వారాలే

ప్రభుత్వాలు మారినా పనితీరు ఒకటే!. గిరిజన విద్య కోసం రూ.కోట్లు ఖర్చు పెడుతున్నామని, కెజి నుంచి పిజి వరకు మీ పిల్లలకు చదువు అంతా తామే చూసుకుంటామంటూ మన పాలకులు ప్రగల్భాలు పలుకుతున్నారు. కానీ ఆచరణలో అవి మచ్చుకైనా కనిపించడం లేదు. ఇప్పటికే గిరిజన విద్యార్థులకు సరిపడా భవనాలు లేక ఇరుకు గదుల్లోనే విద్యను అభ్యసించాల్సిన పరిస్థితి నెలకొంది. మరి కొన్ని పాఠశాలల్లో ప్రహరీగోడ సమస్య వెంటాడుతోంది. కొన్నిచోట్ల డైనింగ్ హాల్, డార్మిటరీ వసతి సమస్య వేధిస్తున్నాయి. ఇలా ప్రతి పాఠశాలలో విద్యార్థులను ఏదో ఒక సమస్య వెంటాడుతూనే ఉంది.

అదనపు భవనం కోసం ఎదురుచూస్తున్న మల్లి పాఠశాల

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట ఐటిడిఎ పరిధిలో 47 ఆశ్రమ పాఠశాలలు, 16 పోస్టుమెట్రిక్ హాస్టళ్లు, 4 గురుకులాలు ఉన్నాయి. ఈ విద్యాసంస్థల్లో సుమారు 20 వేల మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. సీతంపేట ఐటిడిఎ పరిధిలో 23 ఆశ్రమ పాఠశాలల్లో అదనపు భవనాల కోసం ప్రతిపాదించారు. ఒక్కో భవనానికి రూ.5 కోట్లు చొప్పున అధికారులు ప్రతిపాదనలు పంపించినట్లు సమాచారం. వీటిలో సీతంపేట బాలురు, బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలు, మల్లి, పెద్దపొల్ల, బడ్డమాసింగి, గంగంపేట, తదితర పాఠశాలలకు భవనాల కోసం అధికారులు ప్రతిపాదించారు. సీతంపేట మండలంలో ప్రభుత్వ ప్రాథమిక, జిపిఎస్ పాఠశాలలు 169 పాఠశాలలు ఉన్నాయి. అందులో 44 పాఠశాలల్లో నాడు-నేడు పనులు నిధులు లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. వీటిలో కుమ్మరగండి, జొన్నోడుగూడ, పిల్లర్లకే పరిమితమయ్యాయి. సీతంపేట, పనుకువలస ప్రాథమిక పాఠశాలలకు ప్రహరీ పనులు నిలిచిపోయాయి. దాంతోపాటు 10 అంగన్వాడీ కేంద్రాల్లో వివిధ సమస్యలతో నాడు-నేడు పనులు పూర్తికాలేదు. దీంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు.

గత ప్రభుత్వం నాడు-నేడు పనుల్లో హంగులు, ఆర్భాటాలు చేసింది తప్ప అదనపు భవనాలపై దృష్టిసారించలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఇంకా వాటిపై దృష్టిపెట్టలేదు. దీంతో ఐదేళ్లయినా నాడు-నేడు పనులు నిధులు లేమితో పూర్తికాలేదు. పాఠశాలల పున:ప్రారంభానికి పట్టుమని 15 రోజులు కూడా లేవు. ఇప్పటివరకు ఇంజినీరింగ్ అధికారులు అదనపు భవనాలపై దృష్టి సారించలేదు. దీంతో వచ్చే విద్యాసంవత్సరంలోనూ ఇరుకు గదుల్లో చదువులు తప్పవని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

అదనపు గదుల సమస్య వెంటాడుతున్న సీతంపేట బాలుర ఆశ్రమ పాఠశాల

నివేదిక పంపించాం

నాడు-నేడు కార్యక్రమంలో అసంపూర్ణంగా ఉన్న పాఠశాలల పనులు అంచనాలు వేశాం. ఉన్నతాధికారులకు నివేదిక పంపించాం. విద్యార్థులకు ఉపయోగపడే విధంగా పాఠశాలలను అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తున్నాం.

– పి.రమాదేవి, ట్రైబల్ వెల్ఫేర్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, సీతంపేట ఐటిడిఎ

అదనపు భవనాలకు ప్రతిపాదనలు

సీతంపేట ఐటిడిఎ పరిధిలో 23 ఆశ్రమ ఉన్నత పాఠశాలల్లో అదనపు భవనాలు అవసరం. ఒక్కొక్క పాఠశాల అదనపు భవనం కోసం రూ.5 కోట్లు చొప్పున ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం.

-ఎం.అన్నదొర, గిరిజన సంక్షేమ శాఖ డిడి, సీతంపేట ఐటిడిఎ

థియేటర్‌లో తనిఖీలు చేపడుతున్న జెసి శోబిక

సినిమా థియేటర్‌లో జెసి తనిఖీలు

ప్రజాశక్తి-పార్వతీపురం

సినిమా హాల్ నిర్వహణలో నిబంధనలు తప్పక పాటించాల్సిందేనని జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోబిక యాజమాన్యాన్ని ఆదేశించారు. మండలంలోని నర్సిపురం టిబిఆర్ థియేటర్‌లో బుధవారం జెసి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఎంఆర్‌పి ప్రకారం తినుబండారాల విక్రయం చేస్తున్నది, లేనిది, కాలం చెల్లిన స్నాక్స్ ఉన్నాయా? అని పరిశీలించారు. ఫుడ్ శాంపిళ్లను సేకరించాలని ఆహార భద్రత అధికారి రామయ్యను ఆదేశించారు. క్యాంటీన్‌లో అమ్మకాల ధరలను చూశారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు భద్రతా ప్రమాణాలు, బయటకు వెళ్లే దారిని నిశితంగా గమనించారు. నిబంధనలు అతిక్రమించి అనధికారికంగా సినిమా టికెట్ల అమ్మకాలు జరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ జయలక్ష్మి, విఆర్‌ఒ శంకర్ పట్నాయక్, విద్యుత్ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

యోగాసనాలు వేస్తున్న పట్టణ ప్రజలు

యోగాతో ఆరోగ్యం

ప్రజాశక్తి-పార్వతీపురంటౌన్

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని యోగా గురువు మోహన్ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమంలో భాగంగా జిల్లాలో పార్వతీపురం, సాలూరు, పాలకొండ మున్సిపాలిటీలో రహదారులపై యోగా కార్యక్రమం నిర్వహిస్తూ ప్రజల్లో స్ఫూర్తి నింపే కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా పార్వతీపురంలో బంధంవారివీధిలో యోగా గురువు మోహన్ యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో కమిషనర్ వెంకటేశ్వర్లు, ఎఎస్‌ఒ వీరినాయుడు పాల్గొన్నారు.

కురుపాం : దైనందిక జీవితంలో ప్రతిఒక్కరికీ మానసిక ప్రశాంతత కావాలంటే యోగాతోనే సాధ్యమని ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి తెలిపారు. బుధవారం ఎంపిడిఒ కార్యాలయం వద్ద యోగాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా మండల పరిషత్, సచివాలయ, ఉపాధి హామీ, వెలుగు సిబ్బందితో కలిసి యోగాను నిర్వహించారు.

సీతానగరం : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో యోగాంధ్రపై శిక్షణ నిర్వహించారు ఈ సందర్భంగా మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది శిక్షణలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎంఎస్‌ఎల్ ప్రసాద్, వైద్యాధికారి పి.ఉషారాణి, కెకె కుమార్ వర్మ పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న కార్మికులు, నాయకులు

వరద సహాయక పనుల బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్.

విజయవాడలో వరద సహాయక పనుల జీతాల బకాయిలను చెల్లించాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యాన బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు నిరసన చేపట్టారు. అనంతరం మున్సిపల్ మేనేజర్ లక్ష్మికి వినతి అందించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ మాట్లాడుతూ విజయవాడలో వరదల సందర్భంగా 8 రోజులు పారిశుధ్య పనులు నిర్వహించేందుకు వెళ్లిన 20 మంది కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం దుస్తులు, టిఎ, డిఎల నిమిత్తం ఇచ్చిన రూ.40 వేలు నేటికీ ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. కార్మికులకు వెంటనే ఇన్సెంటివ్ చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో పి.నరేష్, నాగవంశం మల్లేష్, జి.గుంపస్వామి, జి.గంగరాజు, ఎ.మజ్జి, అంతరపల్లి రాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాలు వేస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం ఆర్‌టిసి కాంప్లెక్స్ పరిసరాల్లో షాపులు నడుపుతున్న వ్యాపారులు ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త, చెదారం వేస్తే కఠిన చర్యలు తప్పవని పంచాయతీ సిబ్బంది హెచ్చరికలు జారీ చేశారు. బుధవారం షాపులకు వెళ్లి నోటీసులు అందించారు. నోటీసు అందజేసిన తరువాత కూడా చెత్త వేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు. పంచాయతీ నుంచి పొందుతున్న సేవలు నిలిపివేస్తామన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి ప్రజల ఆరోగ్యం కాపాడాలని విఆర్‌ఒ భాస్కరరావు, డిజిటల్ అసిస్టెంట్ సందీప్ కోరారు.

డిప్యూటీ ఎంపిడిఒ రమణమూర్తి మృతి

ప్రజాశక్తి-వీరఘట్టం

రమణమూర్తి (ఫైల్)

వీరఘట్టం ఎంపిడిఒ కార్యాలయంలో డిప్యూటీ ఎంపిడిఒగా విధులు నిర్వహిస్తున్న తూలుగు రమణమూర్తి నాయుడు బుధవారం ఆకస్మికంగా మృతిచెందారు. ఆయన గత కొద్ది రోజుల నుండి అనారోగ్యానికి గురైనప్పటికీ విధులు నిర్వహిస్తూనే ఉన్నారు. బుధవారం పరిస్థితి విషమించి మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రమణమూర్తికి భార్య భానుమతి, కుమార్తెలు కరుణశ్రీ, శివాని ఉన్నారు. రమణమూర్తి మృతికి ఎంపిడిఒ బి.వెంకటరమణ, సిబ్బంది సంతాపం తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి-పాచిపెంట

వివాహిత ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని మోసూరులో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మోసూరుకు చెందిన ఆమిటి వేలంగిని (19)కి పశ్చిమగోదావరి గోదావరి జిల్లా భీమవరానికి చెందిన నిమ్మది బాబ్జితో రెండు నెలల క్రితం వివాహం జరిగింది. కొద్ది రోజులుగా కన్నవారింటి వద్ద ఉంటోంది. రుతుక్రమ సమయంలో వేలంగిని కడుపు నొప్పితో తరచూ బాధపడేది. అదే క్రమంలో మంగళవారం రాత్రి కడుపు నొప్పి తీవ్రంగా రావడంతో తాళలేక ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. వేలంగిని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక హెడ్ కానిస్టేబుల్ కృపారావు కేసు నమోదు చేశారు.

ఇప్పల పోలమాంబ జాతరను

సమన్వయంతో విజయవంతం చేయాలి

ఉత్సవ కమిటీ, అధికారులతో కలెక్టర్ సమావేశం

ప్రజాశక్తి-పార్వతీపురంటౌన్

పార్వతీపురంలో జూన్ 1, 2, 3 తేదీల్లో నిర్వహించే ఇప్పల పోలమాంబ జాతరను సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ కోరారు. జాతర నిర్వహణపై బుధవారం కలెక్టరేట్‌లో జాతర కమిటీ, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పల పోలమాంబ జాతరకు పెద్దఎత్తున యాత్రికులు హాజరయ్యే అవకాశం ఉందని అన్నారు. జాతర జరిగే మూడు రోజులూ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా, సజావుగా జరిగేలా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జాతరకు వచ్చే ప్రజలకు అవసరమైన తాగునీరు, మరుగుదొడ్లు, ఇతర మౌలిక వసతుల కల్పన ఏర్పాట్లు పక్కాగా ఉండాలన్నారు. ఇతర జిల్లాల నుంచి యాత్రికులు రానున్న నేపథ్యంలో అందుకు తగినట్లుగా ఆర్‌టిసి బస్సులను నడపాలని తెలిపారు. పురపాలక సంఘం, విద్యుత్తు, పోలీస్, రెవెన్యూ, పంచాయతీరాజ్, ఇతర శాఖల అధికారులు నిత్యం పర్యవేక్షిస్తుండాలని సూచించారు. అనుకోని సంఘటనలు ఏర్పడితే తక్షణమే స్పందించేలా క్విక్ రెస్పాన్స్ బృందాలను ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. జాతరకు వచ్చే బస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహనాల పార్కింగ్ కోసం గుర్తించిన స్థలాలను సిద్ధం చేసుకోవాలని, సిరిమాను తిరిగే ప్రాంతాలతో పాటు అన్ని ముఖ్య ప్రాంతాల్లో గట్టి పోలీసు బందోబస్తుతోపాటు రోప్ పార్టీలను సంసిద్ధం చేయాలని పోలీస్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. శాంతిభద్రతలకు భంగం వాటిల్లకుండా, భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పాడుబడిన గృహాలు, భవనాలకు దగ్గరగా ఉన్న విద్యుత్తు తీగల వద్ద ప్రజలు ఉండకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వేసవి దృష్ట్యా పలు ప్రాంతాల్లో చలివేంద్రాలను ఏర్పాటుచేసి, తాగునీరు, మజ్జిగ పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. లోఓల్టేజీ సమస్య తలెత్తకుండా అవసరమైన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని, సిరిమాను తిరిగే సమయంలో విద్యుత్ నిలిపివేయాలని ఆదేశించారు. జాతరలో పారిశుధ్యం ప్రధానమని, పరిశుభ్ర వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వృథా అయిన ఆహార పదార్థాలు, వ్యర్థాలను ప్రజలు రహదారులపై పారబోయరాదని కోరారు. అవసరం మేరకు డస్ట్ బిన్లు ఏర్పాటు చేస్తామని, వాటిలో మాత్రమే వేయాలని సూచించారు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించాలని, అంబులెన్సులు, మందులు, ఒఆర్‌ఎస్ ప్యాకెట్లు సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ స్పష్టంచేశారు. అగ్నిమాపక వాహనం సిద్ధంగా ఉండాలన్నారు. సమన్వయంతో జాతరను విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు.

ఉత్సవ కమిటీ, అధికారులతో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ఈ సమావేశంలో పార్వతీపురం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి టి.కొండలరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఎస్.భాస్కరరావు, పోలీస్ అధికారులు, కమిటీ సభ్యులు బెలగాం జయబాబు, రమణ, అధికారులు, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

నకిలీ ఇళ్ల పట్టాల వెనుక

సూత్రధారులెవరో?

ప్రజాశక్తి-పార్వతీపురం

పట్టణంలో నకిలీ ఇళ్ల పట్టాల పంపిణీ వెనుక అసలు సూత్రధారులు ఎవరోనన్న చర్చ జరుగుతోంది. అధికారపార్టీ నాయకుల అండదండలు లేకుండా ఇలాంటి మోసాలకు పాల్పడలేరనే వాదనలు వినిపిస్తున్నాయి. ఈ నెల 11న పట్టణంలోని సాయినగర్ కాలనీకి చెందిన కల్లూరి సురేశ్ అనే వ్యక్తి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నకిలీ పట్టాల బాగోతం బయటపడింది. తన వద్ద డబ్బులు తీసుకుని నకిలీ ఇంటి పట్టా అందజేశారని సురేష్ ఫిర్యాదు చేయడంతో పోలీసులు విచారణ ప్రారంభించారు. ఏడు నకిలీ పట్టాలు జారీ చేశారని పోలీసులు చెబుతున్నారు. ఈ వ్యవహారంలో పోలీసులు అండు పద్మాంబిక అనే మహిళని అరెస్టు చేశారు. మరో ఇద్దరు మహిళల ప్రమేయం గురించి విచారణ చేపట్టారు. మహిళలే ఈ నకిలీ పట్టాల బాగోతంలో కీలక పాత్ర పోషించారంటే తెరవెనుక అధికారపార్టీ నాయకుల అండదండలు ఉన్నాయనే ప్రచారం జరుగుతోంది. పోలీసులు అరెస్టు చేసిన మహిళ పద్మాంబిక టిడిపిలో క్రియాశీలక పాత్ర పోషించినట్లు తెలుస్తోంది. పార్టీకి చెందిన ముఖ్య నాయకులతో ఆమెకు సత్సంబంధాలు ఉన్నాయనే వాదనలు వినిపిస్తున్నాయి. టిడ్కో ఇళ్లకు సంబంధించిన నకిలీ పట్టాలను తయారు చేసి పేదలకు అమ్ముకున్నట్లు తెలుస్తోంది.

నిష్పాక్షిక విచారణ జరుగుతుందా?

నకిలీ పట్టాల బాగోతంపై జిల్లా అధికారులు నిష్పాక్షిక విచారణ జరిపిస్తారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికార పార్టీ నాయకుల అండదండలతో ఈ వ్యవహారంలో కొంతమంది మహిళలు కీలక పాత్ర పోషించిన నేపథ్యంలో విచారణ ముందుకు సాగుతుందా? లేదా? ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

సమైక్యతా ర్యాలీలో పాల్గొనండి

ప్రజాశక్తి-బలిజిపేట

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

మత సామరస్యం, దేశ సమగ్రత కోసం సిపిఎం చేపట్టే సమైక్యతా ర్యాలీలో పాల్గొనాలని సిపిఎం జిల్లా నాయకులు రెడ్డి వేణు, మండల నాయకులు వై.మన్మథరావు కోరారు. ఈ మేరకు బుధవారం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో సమైక్యతా ర్యాలీ కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పహల్గాంలో ఉగ్రదాడి అనంతరం జవాన్లు చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతమైందని తెలిపారు. ఈ సందర్భంలోనే కొన్ని శక్తులు ఉగ్రవాదానికి మతంతో ముడేసి, ప్రజల మధ్య చిచ్చుపెట్టాలని చూస్తున్నాయని చెప్పారు. ఈ శక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ నేపథ్యంలో సిపిఎం ఆధ్వర్యాన ఈ నెల 30 వరకు సమైక్యతా యాత్రలు చేపడుతున్నట్లు తెలిపారు. పార్వతీపురం, కోయ, పెద్దింపేట మీదుగా నారాయణపురం వరకు బస్సు నడపాలని ఈ నెల 30న తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బి.భానుమూర్తి, దన్నాన త్రినాథ, గంట్యాడ బలరాం, ఆవు సాంబమూర్తి, నల్ల ఈశ్వరరావు, వెన్నెల వేణుగోపాల్, లక్ష్మి పాల్గొన్నారు.


విద్యార్థినికి మెమోంటో, ప్రశంస పత్రాన్ని అందిస్తున్న కలెక్టర్

నిరాశ్రయులకు ఆధార్ కార్డులు

కంటోన్మెంట్ : జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత ఆధ్వర్యంలో జిల్లా కోర్టు కాన్ఫరెన్స్ హాల్లో నిరాశ్రయులు, అనాథలైన బాల బాలికలకు ఆధార్ కార్డులు జారీ చేసే కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణ ప్రసాద్ మాట్లాడారు.

గురుకుల విద్యార్థులకు కలెక్టర్ ప్రశంస

ప్రజాశక్తి- వేపాడ

గురుకుల విద్యాలయాల్లో చదవి పది, ఇంటర్‌లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ తన కార్యాల యంలో బుధవారం అభినందించి ప్రశంసా పత్రాలను అందించారు. అత్యుత్తమ ఫలితాలు చాటిన ఒక్కక్క పాఠశాల నుండి ఇద్దరు విద్యార్థినిలు చొప్పన 16 మందిని, ఎంపిక చేసి జిల్లా కలెక్టర్ అంబేద్కర్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు చేతులు మీదుగా మెమోంటో, ప్రశంసా ప్రతాలను అందజేశారు. పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో శత శాతం ఫలితాలను సాధించిన టీచర్స్‌కు కూడా మెమంటో, ప్రశంసా ప్రతాలను అందజేశారు. ఉత్తమ ఫలితాలు సాధించిన ప్రిన్సిపాల్స్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ఎస్.రూపావతి, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్స్ టి.జయశ్రీ, రాణిశ్రీ, శ్రీనివాసునాయుడు, కెఎంఆర్ నారాయణరావు, రఘురామనాయుడు, ఉషారాణి, పిల్లలు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

30న పోలమాంబ హుండీల లెక్కింపు

ప్రజాశక్తి-మక్కువ

శంబరలోని పోలమాంబ అమ్మవారి చదురుగుడి, వనంగుడి హుండీలను ఈ నెల 30న లెక్కిస్తున్నట్లు ఆలయ ఇఒ వివి సూర్యనారాయణ తెలిపారు. శంబర గ్రామంలోని చదురుగుడి వద్ద హుండీలు లెక్కిస్తున్నట్లు చెప్పారు.

డిఎ జుగా శిబిరాల్లో ధ్రువపత్రాలు జారీ

కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ప్రజాశక్తి-పార్వతీపురం

ధర్తీ ఆబా జన్ జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ (డిఎ జుగా) అవగాహన కార్యక్రమాలకు సిద్ధం కావాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. జూన్ 15 నుంచి 30 వరకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జూన్ 14వ తేదీకి గిరిజనుల అవసరాలను గుర్తించి నివేదిక సిద్ధం చేసి, ధ్రువపత్రాలను జారీ చేయాలని ఆయన ఆదేశించారు. డిఎ జుగా నిర్వహణపై కలెక్టర్ కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా గిరిజన ప్రాంతాలలో సేవలు, మౌలిక సదుపాయాలు కల్పించేందుకు డిఎ జుగా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామ స్థాయి/ క్లస్టర్ స్థాయి శిబిరాల ద్వారా వివిధ సౌకర్యాలను క్షేత్ర స్థాయిలో అందించుటకు ఉద్దేశించినట్లు తెలిపారు. పివిటిజి గృహాలు, గిరిజన గ్రామాలను గుర్తించడం, గ్రామ/క్లస్టర్ స్థాయి శిబిరాలను నిర్వహించడం, ఆరోగ్యం, ఆహారం, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, సామాజిక న్యాయం, వ్యవసాయం, రెవెన్యూ ఇతర విభాగాల సమన్వయంతో కార్యకలాపాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఆధార్, ఇకెవైసి డాక్యుమెంటేషన్ సేవల కోసం సంబంధిత విభాగాలు పనిచేస్తాయన్నారు. ఆధార్‌లో నమోదు కానివారిని అంగన్వాడీ సిబ్బంది నమోదు చేయించాలని ఆయన ఆదేశించారు. సంబంధిత శాఖలు జూన్ 14వ తేదీ నాటికి అవసరాలు గల లబ్ధిదారుల వివరాలను సేకరించాలని, జూన్ 15 నుంచి జరిగే అవగాహన శిబిరాల్లో వారికి ధ్రువపత్రాలను అందజేయాలని ఆదేశించారు. మండల స్థాయి అధికారులు ఇందులో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్వతీపురం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి అశుతోష్ శ్రీవాస్తవ, సీతంపేట ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, కెఆర్‌ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.ధర్మచంద్రా రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఎస్.భాస్కరరావు, డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ ఎం సుధారాణి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.రామచంద్రరావు, జిల్లా ఆర్.డబ్ల్యు.ఎస్ ఇంజినీరింగ్ అధికారి ప్రభాకర రావు, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి బి చంద్ర శేఖర్, జిల్లా పశుసంవర్ధక అధికారి ఎస్.మన్మథరావు, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి టి.కొండలరావు, జిల్లా ఉద్యాన అధికారి బి.శ్యామల, ఇన్‌ఛార్జి జిల్లా మత్స్య శాఖ అధికారి టి.సంతోష్ కుమార్, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఐ.రాజేశ్వరి, జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి ఎన్.కృష్ణ వేణి, జిల్లా బిసి సంక్షేమ సాధికారిత అధికారి ఇ.అప్పన్న, డిప్యూటీ డిఎంహెచ్ఒ టి.జగన్మోహన రావు, జిల్లా పరిశ్రమల అధికారి ఎం.వి.కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

బదిలీల్లో జిఒ 22ను అమలు చేయాలి

ప్రజాశక్తి-పార్వతీపురం

ఉపాధ్యాయుల బదిలీల్లో జిఒ నంబర్ 22 అమలు చేయాలని పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు కోరారు. బుధవారం ఉపాధ్యాయ సంఘాలతో ఐటిడిఎ అధికారులు సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మురళీమోహన్ రావు, ఎపిటిఎఫ్ నాయకులు బాలకృష్ణ, ఆదివాసీ ఉపాధ్యాయుల సంఘం నాయకులు అమీర్‌నాథ్ బదిలీల నిబంధనల అమల్లో సమస్యలను వివరించారు. బదిలీల్లో పారదర్శకత పాటించాలని, సర్వీస్ పాయింట్లు కలపాలని, హెచ్‌ఎంలకు ఐదేళ్లు, ఎస్‌జిటిలకు, సీనియర్ అసిస్టెంట్లకు 8 ఏళ్లు గరిష్ట పరిమితి విధించాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.

కూటమి వైఫల్యాలను ప్రజలకు వివరించాలి

జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కూటమి ప్రభుత్వం వైఫల్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి జూన్ 4న జరిగే ప్రజా వంచన దినంగా చేపట్టే కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వైసిపి జిల్లా అధ్యక్షులు, జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, పరిశీలకులు కిల్లి సత్యన్నారాయణ కు కోరారు. బుధవారం వైసిపి జిల్లా కేంద్ర కార్యాలయంలో జిల్లా కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బూత్ లెవల్‌నుంచి సంస్థగతంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా పార్టీ అడుగులు వేస్తోందన్నారు. గ్రామస్థాయి వరకూ కమిటీల నియామకం యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. అంకితభావం, కష్టపడేతత్వం, కెపాసిటీ ఉండే వ్యక్తులకు పార్టీ కమిటీల నియామకంలో ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పార్టీ పిలుపు మేరకు ప్రతీ కార్యక్రమంలో చురుగ్గా.గ్రామ స్థాయిలో పాల్గొనాలన్నారు. వైసిపి అనుబంధ విభాగాలన్నీ పార్టీకి వెన్నెముకలాగా ఉండాలన్నారు. పార్టీ అనుబంధ విభాగాలన్నీ సోషల్ మీడియాను విస్తతంగావాడుకోవాలన్నారు. ప్రజలను విస్మరించి కూటమి ప్రభుత్వం చేసిన మోసాలను జనంలోకి తీసుకెళ్ళడంలో అనుబంధ విభాగాలు కీలకపాత్ర పోషించాలన్నారు. ప్రజలకు మాట ఇచ్చి తప్పిన కూటమి ప్రభుత్వంపై ప్రజావ్యతిరేక పోరాటాలకు సంసిద్ధంగా ఉండాలన్నారు. కూటమి ప్రభుత్వం చేసిన మోసాలను జనంలోకి తీసుకెళ్లాలని అన్నారు. ఈ క్రమంలో ఎన్నికల ఫలితాలు వెలువడిన జూన్ 4న వెన్నుపోటు దినంగా నిర్వహిస్తామని ప్రకటించారు. ఆ రోజున ప్రజలతో కలిసి నిరసనలు చేపట్టడం, కలెక్టర్లను కలిసి హామీల డిమాండ్ పత్రాలను అందజేయాలన్నారు. చంద్రబాబు చేసిన మోసానికి నిరసనగా చేపడుతున్న ఈ కార్యక్రమంలో ప్రజలంతా పాల్గొనాలని కోరారు.

సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు

ఎన్‌టిఆర్‌కు ఘన నివాళి

గుమ్మలక్ష్మీపురం.. ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కురుపాం.. ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కొమరాడ... ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు


సీతంపేట.. ఎన్‌టిఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు, సిబ్బంది

పార్వతీపురంటౌన్.. ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద కేకు కట్ చేస్తున్న నాయకులు

మక్కువ.. ఎన్‌టిఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు, సిబ్బంది